క్లుప్తంగా

ఆర్‌యూను ప్రక్షాళన చేయాలి



వీసీ బసవరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీని ప్రక్షాళన చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వి.బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్ మాట్లాడుతూ.. వర్సిటీని అభివృద్ధి చేయాలని, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్సిటీ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించాలన్నారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలకు నిధులు కేటాయించి సౌకర్యాలు కల్పించాలన్నారు. హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఏఐఎస్‌ఎఫ్ వర్సిటీ నాయకులు శివ, ఈశ్వర్, పవన్, సురేష్, తదితరులు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ



ఆర్‌ఐసీయూలో రోగులను పరామర్శిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు సోమవారం స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలను తనిఖీ చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పలు వార్డులను సందర్శించారు. అనంతరం ఆర్‌ఐసీయూ, ఎమర్జెన్సీ విభాగాల్లో ఉన్న రోగులను పరామర్శించారు. ఆసుపత్రిలో అందు తున్న వైద్య సదుపాయాలు, కల్పిస్తున్న వైద్య సౌకర్యాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది వివరాలపై ఆరా తీశారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రికి సంబంధించిన పలు విషయాలపై అధికారులతో చర్చించారు. ఆసుపత్రికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

పదోన్నతి కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న హెల్త్ సెక్రటరీలు

కర్నూలు(సెంట్రల్): సచివాలయాల్లో పని చేస్తున్న హెల్త్ సెక్రటరీలకు గ్రేడు–3 ఏఎన్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీల సంఘం రాష్ట్ర కార్యదర్శి సంధ్యారాణి డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో హెల్త్ సెక్రటరీలు తమకు పదోన్నతి కల్పించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్ జిల్లాలో సచివాలయాల హెల్త్ సెక్రటరీలకు గ్రేడు–3 ఏఎన్‌ఎంలుగా పదోన్నతి కల్పించారని, కర్నూలు జిల్లాలో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వెంటనే వైద్య ఆరోగ్య శాఖాధికారులు కలుగజేసుకొని పదోన్నతులు కల్పించాలన్నారు. నాయకులు మహేశ్వరి, వెంకటేశ్వరమ్మ, సుగుణమ్మ, పాల్గొన్నారు.

కామ్రేడ్ రాజగోపాల్‌కు నివాళి

కర్నూలు(సెంట్రల్): కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడు రాజగోపాల్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. సోమవారం సుర్జీత్ భవన్‌లో ఇటీవల మరణించిన రాజగోపాల్ సంస్మరణ సభను నిర్వహించారు. సీపీఎం నాయకులు ఎం.రాజశేఖర్, ఎండీ అంజిబాబు, పి.నిర్మల పాల్గొన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. రాజగోపాల్ సీఐటీయూలో సభ్యుడిగా ఉంటూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. ప్రజా నాట్య మండలిలో ఉంటూ తన గేయాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశారని కొనియాడారు.

చంద్రబాబు హామీలను నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న మునెప్ప

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయన్నారు. నాయకులు వెంకటేష్, గణేష్, బీమరాజు. వీరేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

నిర్మాణ పనులు పూర్తి చేయండి

- టిడ్కో గృహాలు కేటాయించాలి
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పలువురి వినతులు



పీజీఆర్‌ఎస్‌లో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ

కర్నూలు (టౌన్): నగరంలోని 12వ వార్డు బాపూజీ నగర్ ఎస్సీ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయని, త్వరగా పనులు చేపట్టాలని స్థానికులు శేఖర్, రమేష్ బాబు వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకున్నారు. వివిధ సమస్యలపై వచ్చిన 13 అర్జీలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అడిషనల్ కమిషనర్ హామీ ఇచ్చారు. మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇవే...

- 15వ వార్డు బుధవారపేటలో నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించాలని జైభీమ్ దళిత వికాస సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి హరికృష్ణ విన్నవించారు.
- 19వ వార్డు మారుతి నగర్, టైపిస్టు కాలనీలో ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని, జాతీయ రహదారి నుంచి సుద్దవాగు వరకు సీసీ రహదారి నిర్మించాలని స్థానికులు తిమ్మయ్య, నరసింహులు, రవికుమార్, చాంద్‌బాషా విన్నవించారు.
- తమకు టిడ్కో గృహాలు కేటాయించాలని స్థానికులు మరియమ్మ, సుష్మ, దేవమ్మ అభ్యర్థించారు.
- మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మునెప్ప, నాగరాజు, రాజు, మద్దిలేటి వినతిపత్రం అందజేశారు.

శ్రీశైలంలో అన్యమత వ్యాపారులను తొలగించాలి



ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు, శివ భక్తులు

కర్నూలు కల్చరల్: శ్రీశైలంలోని వ్యాపార సముదాయాలను అన్యమతస్తుల నుంచి విడిపించాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి భానుప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం వీహెచ్‌పీ నాయకులు, శివ భక్తులు శ్రీశైల సత్రం నుంచి కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇరుముడి సమర్పించడానికి వచ్చిన శివ దీక్షా భక్తులపై పోలీసులు నిర్దాక్షిణ్యంగా లాఠీచార్జ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. సంబంధిత పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అన్యమతస్తుడైన పూజాసామగ్రి వస్తువుల విక్రయదారుడు శివ భక్తులపై దాడి చేశారని అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వీహెచ్‌పీ నాయకులు గోవిందరాజులు, గిరిబాబు, బాబూరావు, సత్యనారాయణ, రవిప్రకాష్, ప్రసాద్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ డెలివరీకి డబ్బు వసూలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న జేసీ బి.నవ్య

కర్నూలు (సెంట్రల్): వంటగ్యాస్ సిలిండర్ డెలివరీ కోసం గోదాముల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె గ్యాస్ సిలిండర్ ఏజెన్సీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్యాస్ గోదాము నుంచి 15 కిలోమీటర్ల వరకు ఎలాంటి రుసుము వసూలు చేయకూడదన్నారు. 15 కిలోమీటర్ల తర్వాత నిబంధన మేరకు వసూలు చేయడానికి అనుమతి ఉందన్నారు. అయితే గ్యాస్ డెలివరీ బాయ్‌లు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆ ఫిర్యాదు ఆధారంగా సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోవైపు దీపం- 2 పథకం కింద గ్యాస్ సబ్సిడీ కోసం ఈ-కేవైసీ చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు. డీఎస్‌ఓ రాజారావు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్): నగర శివారులో శిథిలావస్థకు చేరిన రాజీవ్ గృహ కల్ప భవన సముదాయానికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సీపీఐ నాయకులు మంత్రి పి.పార్థసారథికి వినతిపత్రం ఇచ్చారు. సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పి.రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, రామాంజనేయులు తదితరు లు మంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు.

హామీలను గాలికొదిలేసిన ప్రభుత్వం



నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కర్నూలు (టౌన్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి సర్కారు గాలికి వదిలేసిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప విమర్శించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో ఆప్కాస్‌ను రద్దు చేస్తామని ప్రకటించిందన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు నగరపాలక సంస్థ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఏజెన్సీ కంపెనీలకు అప్పజెప్పరాదన్నారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియర్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి మాట్లాడుతూ.. పర్మినెంట్ కార్మికులకు 3 సంవత్సరాల పెండింగ్ సరెండర్ లీవ్ డబ్బులు విడుదల చేయాలన్నారు. కార్మికులకు పనిముట్లు ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్, బాబులాల్, నాగేషులు, అయ్యరాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మందుల కొరత తీర్చాలి



జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతి పత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మౌలిక వసతులు కల్పించి, మందుల కొరత తీర్చాలని, సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌లపై జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న, నగర నాయకులు అఖిల్, రంగన్న సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందక రోగులు వేలకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులు అత్యవసర విభాగానికి వస్తే వారిని ఎక్స్‌రేకు, స్కానింగ్‌కు తీసుకెళ్లేందుకు స్ట్రెచర్ల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందన్నారు. దీనివల్ల చాలా మంది రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారని, మరికొందరు సరైన సమయంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో అడ్మినిస్ట్రేటర్‌గా ప్రత్యేక అధికారిని నియమించినా సమస్యలు పరిష్కారం కాకపోగా మరింత జటిలంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటైన డయాగ్నోస్టిక్ సెంటర్‌లో వైద్యపరీక్షల కోసం ప్రతిరోజూ తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంటోందన్నారు. కార్డియాలజీ, గైనకాలజీ విభాగాల్లో గ్లౌజులు, ఇంజెక్షన్లు, మందులను రోగుల సహాయకులు బయటి నుంచి కొనుగోలు చేసి తేవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఆసుపత్రిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఆరోగ్య లోపాలున్న పిల్లలను గుర్తించాలి



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో విభిన్న సామర్థ్యం గల పిల్లలు, చిన్న వయస్సులో ఆరోగ్య లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి వారికి బాలల సత్వర చికిత్స కేంద్రం ద్వారా చికిత్స చేయిస్తామని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి చెప్పారు. సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డైస్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లీగల్ సర్వీసెస్ వారు ఇంటింటి సర్వే నిర్వహించేందుకు న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ ఆఫీసర్లచే బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సర్వేలో ఆరోగ్య లోపాలున్న పిల్లలను గుర్తించి డైస్ కేంద్రంలో చికిత్స చేయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడి వైద్యులచే పిల్లలకున్న లోపాలు, ఆరోగ్య సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లా టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారి డాక్టర్ శైలేష్‌కుమార్, ప్రోగ్రామ్ మేనేజర్ ఇర్ఫాన్, డాక్టర్ సృజన, ఐసీడీఎస్ అధికారి శారద, న్యాయవాది లక్ష్మీనారాయణ, రాయపాటి శ్రీనివాసులు, పారా లీగల్ వలంటీర్లు హేమంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డీఈఈకి గుండెపోటు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.మనోహర్ రెడ్డి సోమవారం గుండెపోటుకు గురయ్యారు. ఉదయం విధులకు హాజరైన ఆయన మధ్యాహ్నం ఉల్చాల రోడ్డులో ఉన్న ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో ఉండగా ఛాతీలో నొప్పి రావడంతో కింద పడిపోయారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన గాయత్రీ ఎస్టేట్‌లోని విజయ దుర్గా కార్డియాక్ సెంటర్‌కు తరలించారు. సకాలంలో వైద్య చికిత్స అందించడంతో ఆయన కోలుకుంటున్నారు.

వేళ పాళా లేని ఒత్తిళ్లతో ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి

మూడు నెలలుగా కర్నూలు కార్పొరేషన్‌లో పనిచేసే అన్ని విభాగాల అధికారులు, విభాగాధిపతులు, పర్యవేక్షణ అధికారులు, కింది స్థాయి సిబ్బంది సైతం విధి నిర్వహణలో ఒత్తిడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు ఉద్యోగులు, చంటి పిల్లలతో మహిళా ఉద్యోగులు, రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉన్న ఉద్యోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. పని వేళల్లో పనిచేయడం కన్నా.. వేచి చూడటం, ఉన్నతాధికారుల నుంచి ఎప్పుడు ఫోన్ వస్తుందో అన్న ఆందోళన ఎక్కువగా ఉంది. ఇక ఇంజినీరింగ్ అధికారులు, ఉద్యోగుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. పనులు కాక, పనులు చేయక, ఎక్కడి ఫైళ్లు అక్కడే ఉండటంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పనులకు సంబంధించి పెండింగ్ లేకుండా ఫైళ్ల క్లియరెన్స్ ఉంటే ఈ సమస్య ఉండదన్న అభిప్రాయాన్ని ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కూలి చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అధికారులు వలసలను నివారించడంలో విఫలమయ్యారన్నారు. చేసిన పనులకు కూలి చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని పల్లెలన్నీ ఖాళీ అయ్యాయని, ఏ గ్రామంలో కూడా ఉపాధి పనులను సరిగా కల్పించడం లేదన్నారు. అధికారుల వైఖరితోనే వలసలు పెరిగిపోతున్నాయన్నారు. ఉపాధి కూలీలకు రోజు వేతనం రూ.700 ఇవ్వాలని, 200 రోజులు పని దినాలను కల్పించాలని కోరారు. నాయకులు మద్దిలేటి శెట్టి, భాస్కర్, భూపేష్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను తక్షణమే విడుదల చేసి దళిత, గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి సి.మహేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా సబ్ ప్లాన్‌కు ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్య పథకానికి రూ.72 కోట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కోనేరు రంగారావు కమిటీ సిఫారసులను తక్షణమే అమలు చేయాలన్నారు.డీహెచ్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీసీవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా అశోక్



అశోక్

కర్నూలు(అర్బన్): బీసీ యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా అశోక్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సైకం రాజశేఖర్ సోమవారం నియామక పత్రాన్ని పంపారు. అలాగే జిల్లా ఉపాధ్యక్షుడిగా గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా గోపినాథ్, కార్య నిర్వాహక కార్యదర్శిగా రవిరాజ్, సహాయ కార్యదర్శిగా పవన్‌గౌడ్‌ను నియమించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. బీసీ హక్కుల సాధన కోసం సమష్టిగా పోరాడతామన్నారు. బీసీవైఎఫ్‌కు నూతన కార్యవర్గాన్ని నియమించడం పట్ల బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌బాబు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడాకారులకు అభినందన

కర్నూలు (టౌన్): ఈ నెల 20, 21 తేదీల్లో రాజమండ్రిలో నిర్వహించిన ఖేలో ఇండియా ఉషూ రాష్ట్రస్థాయి పోటీల్లో కర్నూలు నగరానికి చెందిన జేఎంజే స్కూల్ విద్యార్థినులు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు నిత్య (బంగారం), సత్య, మేఘన (వెండి), దీపిక గ్రేస్, ప్రవల్లిక, మనీ (కాంస్యం)లను సోమవారం పాఠశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ సిస్టర్ ఎలిజబెత్ అభినందించారు. జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ ఆగడాలు అడ్డుకోండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్, కల్లూరు మండలాల టీడీపీ నాయకుల ఆగడాలను అడ్డుకోవాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరుగుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన బాధితులతో కలిసి వినతి పత్రం అందించారు. ఓర్వకల్ మండలం పాలకొలనులో పేదలకు ఇళ్ల పట్టాల కోసం ఇచ్చిన స్థలాన్ని టీడీపీ నాయకులు ఆక్రమించుకొని పంటలు పండించుకుంటున్నారని, ఇదే విషయమై గతంలో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. అలాగే కల్లూరు మండలం మార్కాపురంలో టీడీపీ నాయకుడు రామాంజనేయులు తన ఇంటి దగ్గరే రేషన్ పంపిణీ చేస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సచివాలయం వద్ద రేషన్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకరరెడ్డి, పాలకొలను రమేష్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన



ధ్రువపత్రాల పరిశీలనకు తరలివచ్చిన దరఖాస్తుదారులు

కర్నూలు (టౌన్): స్థానిక సుంకేసుల రోడ్డులోని నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో సోమవారం బీసీ రుణాలకు సంబంధించి దరఖాస్తుదారుల ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. మెప్మా టీపీఆర్ ఓ వెంకటలక్ష్మీ, బ్యాంకర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. దరఖాస్తుదారులతో మాట్లాడిన టౌన్ ప్రాజెక్టు అధికారులు వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. నగరంలోని 1 నుంచి 70వ సచివాలయం పరిధిలోని దరఖాస్తుదారుల నుంచి ఫారంతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా టీపీఆర్‌ఓ మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతుందన్నారు. మొత్తం 1510 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జగన్నాథగట్టు అభివృద్ధి సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రూపాల సంగమేశ్వర స్వామి జగన్నాథగట్టు అభివృద్ధి సమితి అధ్యక్షుడు ప్యాలకుర్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 9 గంటలకు గణపతి పూజ, కలశ స్థాపన, పుణ్యావాచనం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 26వ తేదీ ఉదయం 5 నుంచి 9 గంటల వరకు పంచామృతాభిషేకాలు, 12 గంటల వరకు పాలాభిషేకం, మధ్యాహ్నం 1 గంటకు స్వామివారికి అలంకరణ, దర్శనం, సాయంత్రం 6 గంటలకు దిన్నెదేవరపాడు గ్రామస్తులచే ప్రభోత్సవం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం, భక్తులు జాగరణ చేసేందుకు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథ, భజన, కార్యక్రమాలు, 27వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, స్వామివారికి ప్రాకార పల్లకీ సేవ, సాయంత్రం 5 గంటలకు శివపార్వతుల రథోత్సవం జరుగుతుందన్నారు. సమితి కార్యదర్శి ఎస్.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. భక్తులు ఆలయం చేరుకునేందుకు ఏపీఎస్ ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. గడియారం ఆస్పత్రి, కొత్త బస్టాండ్, రాజ్‌విహార్, సీక్యాంప్, వెంకటరమణ కాలనీ, బళ్లారి చౌరస్తా, కల్లూరు, కృష్ణానగర్, దిన్నెదేవరపాడు మీదుగా జగన్నాథ గట్టుపైకి బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. దేవదాయ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందన్నారు. సమితి కోశాధికారి వాసుదేవయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లికార్జునరెడ్డి, సభ్యులు మురళి, మహేష్, నాగరాజు, సందడి మహేష్, మహాబలేష్, సర్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీకి విఫలయత్నం



చోరీని అడ్డుకున్న యువకులను అభినందిస్తున్న డీఎస్పీ బాబుప్రసాద్



చిన్నటేకూరులో బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం కేంద్రాన్ని ధ్వంసం చేసిన దుండగులు

కర్నూలు: కల్లూరు మండలం ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంను చోరీ చేసేందుకు ప్రయత్నించగా స్థానిక యువకులు అడ్డుకోవడంతో అక్కడినుంచి పరారయ్యారు. షట్టర్‌ను రంపంతో కోసి లోపలున్న ఏటీఎంను తాళ్లతో కట్టి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా సెకండ్ షో సినిమా చూసి వస్తున్న గ్రామ యువకులు ఎం.మహేష్, షేక్ ఇలియాస్, దిలావర్ షేక్ అబ్దుల్ రహిమాన్, మొల్లా హనీఫ్ బాషా గమనించారు. వెంటనే ఉలిందకొండ ఎస్‌ఐ ధనుంజయకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. కర్నూలులోని ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని మహీంద్రా షోరూం వద్ద నిలిపి ఉంచిన టోయింగ్ వాహనాన్ని అపహరించిన దుండగులు చిన్నటేకూరు చేరుకొని ఏటీఎం మిషన్‌ను వాహనంలో తీసుకెళ్లేందుకు యత్నిస్తుండగా గ్రామ యువకులు అడ్డుకోవడంతో వాటిని అక్కడే వదిలేసి పరారయ్యారు. ఏటీఎంలో దాదాపు రూ.4 లక్షలకు పైగా నగదు ఉన్నట్లు సమాచారం.

సబ్ డివిజన్ అధికారులు అప్రమత్తం

ఏటీఎం దొంగతనం విషయం తెలిసిన వెంటనే కర్నూలు డీఎస్పీ జె.బాబుప్రసాద్ సబ్ డివిజన్ అధికారులను అప్రమత్తం చేశారు. డీఎస్పీతో పాటు సీఐలు చంద్రబాబునాయుడు, తబ్రేజ్, ఎస్‌ఐలు మధుసూదన్, ధనుంజయ, సునీల్‌కుమార్ తదితరులు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గతంలో కర్నూలు శివారులోని బాలాజీ నగర్‌లో ఇదే తరహాలో ఏటీఎం చోరీ జరిగింది. అప్పట్లో గస్తీ విధుల్లో ఉన్న హోంగార్డు దుండగులను హర్యానాకు చెందిన దొంగలుగా గుర్తించి అరెస్టు చేశారు. ప్రస్తుతం చిన్నటేకూరులో ఏటీఎం చోరీ యత్నం హర్యానా గ్యాంగ్ పనే అయిఉండొచ్చన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. దుండగులు ఏ వాహనంలో పారిపోయారనే దానిపై దృష్టి సారించి జాతీయ రహదారి వెంట ఉన్న చెక్‌పోస్టులలో సీసీ కెమెరాల పుటేజీని సేకరిస్తున్నారు. దొంగలను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగారు. మాస్కులు ధరించిన దొంగలు ఏటీఎం కేంద్రంలో ఉన్న సీసీ కెమెరా కనెక్షన్ కట్ చేసి, బ్లాక్ పెయింట్ పూసి చోరీకి యత్నించినట్లు తెలిసింది. చోరీని అడ్డుకున్న యువకులను కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ సోమవారం తన కార్యాలయానికి పిలిపించి అభినందించి రివార్డులను అందజేశారు.